# బంగారు మనసులు

టి. రాజేశ్వర్

"టెలిగ్రాం !"

పేపరు చతువుతున్న పరమేశంగారు ఉలిక్కిపడ్డారు. చేతులు వణుకుతుంటే సంతకం పెట్టి కాగితం తీసుకున్నారు. చదివి కుర్చీలో కూలబడిపోయారు.

"ఎక్కడి నుంచండీ టెలిగ్రాం? ఏమిటలా అయిపోయారు?" భార్య సావిత్రి అడిగింది కంగారుగా.

"ఏమీలేదు 'శుభ'కి ఆపరేషన్ చెయ్యాలిట అర్జెంటుగా, హాస్పిటల్‌లో చేర్పించారట. డబ్బు కూడా తెమ్మని రఘు ఇచ్చాడు."

"అయ్యో ఏమయిందండీ నా తల్లికి? ఇంకా అలాగే కూర్చుంటారేం? పదండి గోదావరిలో వెళ్దాం."

"వెళ్దాం, మరి డబ్బో? మొన్ననే అమ్మా యడిగితే పంపావు."

"మీ రిప్పుడు డబ్బుకోసం చూస్తారా? ఇదిగోండి గొలుసు. ఇది అమ్మి డబ్బు పట్రండి. ఆపరేషనంటే మాటలు కాదు. అమ్మాయి కంటే ముఖ్యమా?" బంగారు గొలుసు మెడలో నుంచి తీసి ఇచ్చింది.

"అయ్యో ఎన్ని అవసరాలొచ్చినా అప్పు చేశానే కాని మెడలో గొలుసు తీయలేదు. ఇప్పుడు..." పరమేశంగారు బాధగా అన్నారు.

"అమ్మాయి కంటే ముఖ్యమా? తీసుకెళ్ళండి మళ్ళీ ఆలస్యమౌతుంది?"

** ** **

హైదరాబాద్ స్టేషన్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్ ఆగింది.

"అమ్మా, నాన్నగారూ వచ్చారా? జాగ్రత్తగా దిగండి. డబ్బు తెచ్చారా నాన్నా?" అన్నాడు రఘు.

"తెచ్చానురా అమ్మా యెలా ఉంది?"

"ఏమిటి రఘూ, చెల్లెమ్మ ఎలా ఉంది?" ఆత్రుతగా అడిగింది సావిత్రి.

"చెల్లాయి బాగానే ఉంది. మిమ్మల్ని ఇంటి దగ్గర దింపేసి నేను హాస్పిటల్‌కి వెళ్ళాలి" అంటూ హడావుడిపడ్డాడు రఘు.

ఇంటి కెళ్తేగాని తెలియలేదు హాస్పిటల్‌లో ఉన్నది కోడలు సుధ అని. పరమేశంగారికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. అంతా జంటనగరాల్లోనే ఉంటున్నారు. చిన్న కొడుకు అన్న దగ్గరే బి.టెక్ చదువుతున్నాడు.

కోడలి ఆపరేషన్‌కి గొలుసు అమ్మించినందుకు భర్తని తిట్టుకుంటూనే ఉంది సావిత్రి మనసులో. రఘు హాస్పిటల్‌కి వెళ్ళగానే భర్తని నిలదీసింది.

"ఏమో నాకేం తెలును? టెలిగ్రాంలో శుభ అనే ఉంది" అన్నా రాయన. చిన్న కొడుకు హాస్పిటల్ నుంచి వచ్చాడు.

"వదిన కెలా ఉంది?" అని అడుగుతూ జరిగినదంతా చెప్పింది.

"ఏమో శుభ, సుధ పెద్ద తేడా లేదు ఇంగ్లీషు



స్పెల్లింగ్‌లో, నేనేగా టెలిగ్రాం ఇచ్చాను" అన్నాడు రవి.

"ఇవ్వు డేమైంది. ఎలాగైనా వస్తారుకదా?" అన్నాడు రవి.

"కాదురా... నా గొలుసు అమ్మాను."

"పోనీలే ఎవరికైనా తేవాలిగా?" అంటూ "తలనొప్పిగా ఉంది కాఫీ ఇవ్వమ్మా" అన్నాడు.

"సరే బాగానే ఉందిరా, వంట చెయ్యాలి, పిల్లలేరీ, అక్కయ్య రాలేదే...?"

"తన కవసరమైనప్పుడల్లా వస్తుంది, పోనీ అమ్మ వచ్చేవరకైనా ఉండమంటే ఉండలేదే అక్కయ్య" అన్నాడు రవి స్నానాని కెళ్తూ...

"పోనీలేరా పిల్లలనైనా తీసికెళ్ళింది కదా" అంటూ పనిలో జొరబడింది.

"పిల్లలు నా ప్రాణాలు తోడారనుకో ఇదిగో ఇప్పటికైందనుకో" అంటూ లోపలికొస్తున్న కూతుర్ని తనివితీరా చూసింది తల్లి. పిల్లలు "నాయనమ్మా", "అమ్మమ్మ" అంటూ ఆవిడ దగ్గర చేరిపోయారు.

"హాస్పిటల్‌కి పోదాం. అల్లరి చెయ్యకండి" అని హెచ్చరించారు తాతగారు.



వంటింట్లో తల్లి దగ్గర చేరిన కూతురికి చెబుతోంది సావిత్రమ్మ టెలిగ్రాంలో సుధకి శుభ అని ఉండటం, తను కంగారుపడటం, తన గొలుసు అమ్మినవైనం వగైరా...

"ఏమిటమ్మా నే నా గొలుసు ఈసారి నా పుట్టిన రోజుకి తెచ్చుకుని మా అమ్మగా రిచ్చారని నా ఫ్రెండ్స్‌కి చూపించా లనుకుంటుంటే నీ విలా చేశావు? వదినకి వాళ్ళ అమ్మా, నాన్నగారూ డబ్బు పంపరా? మీకేం పని? అయినా టెలిగ్రాం సరిగ్గా చూసుకోరా?" అంటూ దులిపి పారేసింది. అస లిదంతా తమ్ముడు కావాలనే చేశాడనీ అంది. అందులో తండ్రికి కూడా భాగముందని నిందించింది. సావిత్రమ్మ చెబుతున్నది కూడా వినలేదు. కోపంతో "నేను హాస్పిటల్‌కి వెళతాను" అని తన పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోయింది.

కూతురి ప్రవర్తనకు సావిత్రమ్మ చాలా బాధపడింది. ఒకతే కూతురని ఎంతో గారాబంగా పెంచింది. తూగలేమని తెలిసినా పెద్ద ఉద్యోగస్థుడికే ఇచ్చి చేశారు. ఆడంబరాలకు అతిశయాలకు డబ్బు ఖర్చు పెడుతుంది. ఏదో సరదా పడుతుందని కోరినవన్నీ సమకూర్చేవారు. అన్న కూడా చెల్లెలి కే లోటూ రాకుండానే చూసుకుంటున్నాడు. మొన్నామధ్య మనవరాలు ముచ్చట పడుతుందంటే డబ్బు పంపి గొలుసు చేయించింది. అటువంటిది అవసరానికి, ప్రాణం మీదికి వచ్చినప్పుడు గొలుసు అమ్మితే, కనీసం మానవతా దృష్టి కూడా లేకుండా అన్నదే - అని బాధపడింది. అదీ తనకనే అమ్మింది. కోడలుకైతే అసలు అమ్మమనేదే కాదేమో ! బంగారం దగ్గర కన్నతల్లి కూడా పనికిరానిదే అయిందేమి అనుకుంది. ఒక నిట్టూర్పు విడిచి ఊరుకోక చేసేదేముంది?

రోజులు గడుస్తున్నాయి. పిల్లలతో, హాస్పిటల్‌కి వెళ్ళిరావడంలోనూ సావిత్రమ్మకి తీరుబడి లేదు. శుభ తల్లిదండ్రులు కొడుకు దగ్గర ఢిల్లీలో ఉన్నారు. వాళ్ళు వచ్చేసరికి లేటైంది.

ఆ రోజు రఘు భార్యని హాస్పిటల్ నుంచి ఇంటికి తీసుకొచ్చాడు. రాగానే తల్లిని పిలిచి 'అమ్మా ! ఇదిగో నీ కోడలు ఇలా ఇంట్లో కాలు పెట్టిందంటే నీ చలవేనమ్మా. తల్లిలేని పిల్లల్ని చేయకుండా నా పిల్లల్ని కాపాడావు" అంటూ భార్యా భర్త లిద్దరూ వంగి కాళ్ళకి దణ్ణం పెడుతుంటే సావిత్రమ్మ కన్నీళ్ళతో ఇద్దర్నీ దగ్గరికి తీసుకుంది మనస్ఫూర్తిగా.

"బంగారు మనసులను కాపాడాను గొలుసు అమ్మినా" అనుకున్నారు పరమేశంగారు.

'నిజం చెప్పు ఇప్పటికైనా' - గులాబీరంగు టెలిగ్రాం కాగితం జేబులో గుండె దగ్గర గుసగుసలాడింది. టెలిగ్రాంలో సుధ అనే ఉందనీ, శుభ అని అబద్ధం ఆడాననీ పరమేశంగారు ఎవరితోనూ అనలేదు. టెలిగ్రాఫ్ వారికి క్షమాపణలు చెప్పుకున్నారు మనసులో. ★